## పోలీస్ కమిషనరేట్‌లో ఘనంగా ఆయుధ పూజ

ఆయుధ పూజ చేస్తున్న సీపీ అంబర్ కిశోర్ ఝా

నయీంనగర్, అక్టోబర్ 13 : విజయదశమి పండుగను పురస్కరించుకొని వరంగల్ పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలో ఆయుధ పూజను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి పోలీస్ కమిషనర్ అంబర్ కిశోర్ ఝా ముఖ్య అతిథిగా హాజరై ఐదో భాండాగారం వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో దుర్గామాతతో పాటు ఆయుధాలకు పూజలు నిర్వహించారు. అనంతరం కార్యాలయం ఆవరణలోని జమ్మి పూజలు చేసి. అధికారులు, సిబ్బందికి శమీపత్రాలను అందజేసి పండుగ శుభాకాంక్షలు తెలిపారు. అలాగే, ఎస్‌టీ విభాగంలో పోలీస్ కమిషనర్ పూజలు నిర్వహించారు. వెస్ట్ జోన్ డీసీపీ రవీందర్, అదనపు డీసీపీలు సంజీవ్, సురేశ్ కుమార్, ఏసీపీలు జితేందర్‌రెడ్డి, మధుసూదన్, అనంతయ్య, సురేంద్ర, ఆర్‌ఐలు స్పర్జన్ రాజ్, శ్రీనివాస్, శ్రీధర్, చంద్రశేఖర్, ఆర్‌ఎస్సై శ్రవణ్ సిబ్బంది పాల్గొన్నారు.

## పద్మాక్షి దేవాలయంలో శాంతి కల్యాణం

హనుమకొండ, అక్టోబర్ 13 : పద్మాక్షికాలనీలోని శ్రీహనమద్గిరి పద్మాక్షి దేవాలయంలో ఆదివారం శాంతి కల్యాణం నిర్వహించారు. అమ్మవారిని రాష్ట్ర హైకోర్టు జడ్జి, ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య దర్శించుకొని పూజలు నిర్వహించారు. అలాగే, సాయంత్రం అమ్మవారికి తెప్పోత్సవం నిర్వహించినట్లు అర్చకులు శంకర్‌శర్మ, షణ్ముక పద్మనాభ అవధాని తెలిపారు.

## వైభవంగా శ్రీమత్స్యగిరీశుడి పల్లకీ సేవ

పల్లకీ సేవలో పాల్గొన్న భక్తులు

శాయంపేట, అక్టోబర్ 13 : శాయంపేటలో శ్రీమత్స్యగిరిస్వామి పల్లకీసేవను నిర్వహించారు. ఉత్సవ మూర్తులను పల్లకీలో పెట్టి డప్పు చప్పుళ్లతో పురవీధుల గుండా ఊరేగించారు. దారి పొడవునా స్వామికి జనం నీళు పోస్తూ, కొబ్బరికాయలు కొడుతూ నీరాజనం పలికారు. దళితవాడలోని జమ్మి చెట్టు వద్ద జమ్మి పూజ నిర్వహించారు. అర్చకులు ఆరుట్ల కృష్ణమాచారి భక్తులకు కంకణాలు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ సామల భిక్షపతి, ఎస్సై ప్రమోద్‌కుమార్, గ్రామ పెద్దలు జిన్నా ప్రతాప్ సేనా రెడ్డి, గట్ల భగవాన్ రెడ్డి, వలపదాసి వెంకటరమణ, బాసని మధుసూదన్, మామిడి భరత్‌కుమార్, గొట్టిముక్కుల రమేశ్, వంగల పరమేశ్వర్, రమేశ్, పాడి సమ్మిరెడ్డి, వినుకొండ శంకరాచారి, బాసని సదాశివుడు, చంద్రమౌళి పాల్గొన్నారు.

## కాంగ్రెస్ నాయకుల అత్యుత్సాహం

పరకాల, అక్టోబర్ 13 : దసరా వేడుకల్లో భాగంగా పట్టణంలోని పశువుల సంతలో నిర్వహించిన రావణవధ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు అత్యుత్సాహాన్ని ప్రదర్శించడంతో పలువురు మహిళా కౌన్సిలర్లు ఇబ్బందులు పడ్డారు. మున్సిపాలిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన రావణ వధ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి హాజరయ్యారు. కాగా, ఎమ్మెల్యే వేదిక మీదకు రాగానే పలువురు కాంగ్రెస్ నాయకులు ప్రొటోకాల్ లేకున్నా మహిళా కౌన్సిలర్లను తోసుకుంటూ వేదిక మీదికి దూసుకెళ్లారు. దీంతో స్థానిక కౌన్సిలర్‌తో పాటు బీఆర్‌ఎస్ మహిళాకౌన్సిలర్లు శనిగరపు రజిని, గౌరె స్రవంతి వేదిక మీద నుంచి వెళ్లిపోయారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మున్సిపాలిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకల్లో ఎమ్మెల్యే ముందే ఇలా ప్రొటోకాల్ లేకుండా కాంగ్రెస్ నాయకులు తోసుకుంటూ రావడం ఏమిటని ప్రశ్నించారు. కనీసం మహిళా కౌన్సిలర్లకు గౌరవం ఇవ్వకుండా వ్యవహరించడం సరికాదన్నారు. వేడుకలను కాంగ్రెస్ కార్యక్రమంలా నిర్వహించారని ఆవేదన వ్యక్తం చేశారు.

## ఘనంగా సిరికొండ జన్మదిన వేడుకలు

కేక్‌కట్ చేసి, తినిపిస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

శాయంపేట, అక్టోబర్ 13 : మాజీ స్పీకర్, బీఆర్‌ఎస్ పార్టీ శాసనమండలి పక్ష నేత సిరికొండ మధుసూదనాచారి జన్మదిన వేడుకలు ఆదివారం ఘనంగా జరిగాయి. బీఆర్‌ఎస్ నేతలు మండలంలోని సూరంపేట, కొప్పుల, కాట్రపల్లి, రాజుపల్లి అన్ని గ్రామాల్లో కేక్‌లు కట్ చేశారు. అనంతరం శాయంపేట బస్టాండ్ కూడలికి చేరుకుని పెద్ద ఎత్తున పటాకులు పేల్చి, స్వీట్లు పంపిణీ చేశారు. మండలి ప్రతిపక్ష నేతగా బాధ్యతలు తీసుకుంటున్న నేపథ్యంలో నాయకులంతా హైదరాబాద్‌కు తరలివెళ్లి సిరికొండను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల మాజీ అధ్యక్షుడు గుర్రం రవీందర్, పీఏసీఎస్ డైరెక్టర్ బగ్గి రమేశ్, జిల్లా నాయకుడు నిమ్మల మహేందర్, పోతు రమణారెడ్డి, ఎస్‌కే గౌస్, సూరంపేట సీనియర్ నాయకుడు అడుప ప్రభాకర్, మార్క సుదర్శన్, పోడిశెట్టి గణేశ్, జాలిగపు అశోక్, కొత్త గట్టు సాయి, పల్లెబోయిన సారయ్య, రాజ్‌మహ్మద్, మేరుగుర్తి కర్ణాకర్ పాల్గొన్నారు.

పరకాల : రావణవధ కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి

ఐనవోలు : ఆలయంలో జమ్మి పూజలో పాల్గొన్న గ్రామస్తులు

ఆత్మకూరు : మాట్లాడుతున్న పరకాల ఏసీపీ కిశోర్‌కుమార్

# ఘనంగా దసరా వేడుకలు

- ఊరూరా రావణవధ కార్యక్రమాలు
- జనంతో కిటకిటలాడిన ప్రాంగణాలు
- ఆలయాల్లో ప్రత్యేక శమీ పూజలు
- పాల్గొన్న ప్రజాప్రతినిధులు, నాయకులు

నమస్తేతెలంగాణ నెట్‌వర్క్ : జిల్లా వ్యాప్తంగా శనివారం దసరా వేడుకలు ఘనంగా జరిగాయి. హనుమకొండలోని సిద్ధేశ్వరాలయ ప్రాంగణంలో రావణవధ కార్యక్రమం నిర్వహించారు. వర్షాన్ని సైతం లెక్కచేయకుండా నగర ప్రజలు తరలివచ్చారు. దసరా ఉత్సవ సమితీ అధ్యక్షుడు రావుల సుదర్శన్ ఆధ్వర్యంలో 45 ఫీట్ల రావణ విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి పాల్గొని రావణవధ కార్యక్రమాన్ని ప్రారంభించారు. మాజీ ఎమ్మెల్యే మార్తినేని ధర్మారావు, కార్పొరేటర్ పోతుల శ్రీమన్నారాయణ, ప్రధాన కార్యదర్శి పూల దండం రాజారాం, ఉపాధ్యక్షుడు చీకటి ప్రకాశ్, సాంబరాజు రాజ్‌కుమార్, పులి రజినీకాంత్, కనుకుంట్ల రవికుమార్, పోరుపల్లి రవికుమార్, చేతి రాము, కమిటీ సభ్యులు పాల్గొన్నారు. అలాగే, కాజీపేటలో కూడా దసరా పండుగను ఘనంగా జరుపుకున్నారు. కాజీపేట రైల్వే జంక్షన్ పరిధిలోని రైల్వే కార్యాలయాలు కార్మికులు ఆయుధ (సామాగ్రి) పూజలు చేశారు. లా అండ్ ఆర్డర్, ట్రాఫిక్, జీఆర్పీ, ఆర్పీఎఫ్ స్టేషన్లలో సీఐలు సుధాకర్‌రెడ్డి, నాగబాబు, రామ్మూర్తి, సంజీవరావులు, ఎస్సైలు నవీన్‌కుమార్, లవన్ కుమార్, శివ కృష్ణ, రామారావు, రమేశ్, తదితర సిబ్బంది ఆయుధ పూజ, వాహన పూజలు నిర్వహించారు. కాగా, శ్వేతార్క, రైల్వే దేవాలయాలు, సోమేశ్వర, అభయాంజనేయస్వామి దేవాలయాలు, వడ్డేపల్లి ట్యాంక్‌బండ్ సుబ్రమణ్యస్వామి, వేంకటేశ్వర స్వామి, దేవాలయాలు భక్తులతో కిక్కిరిసి పోయాయి. గంటల తరబడి క్యూలో బారులు తీరారు. 47వ డివిజన్ బాపూజీనగర్‌లో, డీజిల్ కాలనీ రైల్వే ఇన్‌స్టిట్యూట్ ప్రాంగణంలో, వడ్డేపల్లి ట్యాంక్ బండ్ సమీపంలో రావణవధ కార్యక్రమాలు నిర్వహించారు. పండుగ సందర్భంగా సీఐ సుధాకర్‌రెడ్డి ఆదేశానుసారం ఎస్సైలు నవీన్‌కుమార్, లవన్‌కుమార్, శివకృష్ణ సిబ్బందితో బందోబస్తు నిర్వహించారు. న్యూ శాయంపేటలో దసరా సందర్భంగా ఆచారం ప్రకారం జెండా ఎగరవేసి, వాడవాడల జమ్మి ఆకును పంపిణీ చేశారు. అనంతరం బొడ్రాయి యూత్ కమిటీ ఆధ్వర్యంలో రావణవధ కార్యక్రమాన్ని కార్పొరేటర్ మామిండ్ల రాజు ఘనంగా నిర్వహించారు.మాజీ కార్పొరేటర్ వేల్పుల మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు. పరకాల పట్టణంలోని బొడ్రాయి వద్ద మున్సిపల్ చైర్‌పర్సన్ సోదా అనితా రామకృష్ణ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం పట్టణంలోని పశువుల సంత ఆవరణలో రావణవధ కార్యక్రమాన్ని చేపట్టగా ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి పాల్గొని రావణ ప్రతిమకు నిప్పంటించారు. ఆత్మకూరు మండలం పెద్దాపురంలో జరిగిన వేడుకలో పరకాల ఏసీపీ కిశోర్‌కుమార్ పాల్గొని రావణాసుర ప్రతిమకు నిప్పంటించారు. కార్యక్రమంలో సీఐ సంతోశ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు. దామెర మండలం ఊరుగొండలో అర్చకుడు తూపురాణి శ్రీనివాసచార్యులు జమ్మి, ఆయుధ పూజచేయగా పీఏసీఎస్ చైర్మన్ బొల్లు రాజు, మాజీ వైస్ ఎంపీపీ జాకీర్‌అలీ, మాజీ సర్పంచ్ జక్కుల రాణీ రవీందర్, బీఆర్‌ఎస్ నాయకులు కునాటి సునీల్‌రెడ్డి, కుల సంఘాల పెద్దలు పాల్గొన్నారు. దామెరలో మాజీ ఎంపీటీసీ పోలం కృపాకర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ శ్రీరాంరెడ్డి, బీఆర్‌ఎస్ నాయకులు సోనబోయిన రాజు, వేల్పుల ప్రసాద్, దామెర కుమార్, పులుకుర్తిలో మాజీ సర్పంచ్ గోవిందు అశోక్, బీఆర్‌ఎస్ మండల యూత్ అధ్యక్షుడు మెంతుల రాజు, కాంగ్రెస్ నాయకులు వెంకన్న దసరా వేడుకల్లో పాల్గొని జమ్మి, ఆయుధ పూజ చేశారు. ల్యాదెళ్లలో మాజీ ఎంపీపీ కాగితాల శంకర్, బీఆర్‌ఎస్ నాయకులు హింగె శ్రీనివాస్, దుర్గంటపేలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు గండు రామకృష్ణ ఆయుధ పూజ చేశారు. ఎలాంటి గొడవలు జరకుండా ఎస్సై కొంక అశోక్ బందోబస్తు నిర్వహించారు. శాయంపేట పోలీస్‌స్టేషన్‌లో దసరా సందర్భంగా ఆయుధ పూజ నిర్వహించారు. సీఐ రంజిత్‌రావు, ఎస్సై ప్రమోద్‌కుమార్ పాల్గొన్నారు. అలాగే, శాయంపేట బీసీ కాలనీలోని సామల మైదానంలో 30 అడుగుల భారీ రావణాసురుడి ప్రతిమను దహనం చేశారు. కార్యక్రమంలో యూత్ నాయకుడు సాదు నాగరాజు, రవిపాల్ పాల్గొన్నారు. భీమదేవరపల్లి మండలం ముల్కనూర్‌లో హనుమాన్ వ్యాయామశాల ఆధ్వర్యంలో రావణవధ కార్యక్రమం నిర్వహించారు. మండల ప్రజలకు మంత్రి పొన్నం ప్రభాకర్, మాజీ ఎమ్మెల్యేలు ఒడితెల సతీశ్ కుమార్, ప్రవీణ్ రెడ్డి దసరా శుభాకాంక్షలు తెలిపారు. కమలాపూర్‌లోని పోలీస్ స్టేషన్‌తో పాటు, ఉప్పల్, కమలాపూర్ గ్రామాల్లో ఆయుధపూజ చేశారు. అలాగే, గ్రామాల్లో దుర్గామాత నిమజ్జనోత్సవం చేపట్టారు. ఐనవోలు మండల కేంద్రంలో కాటబోయిన అశోక్, పంచాయతీ సెక్రటరీ కిశోర్, జీపీ సిబ్బంది దసరా నిర్వహించారు. పోలీసు స్టేషన్‌లో ఎస్సైలు పస్తం శ్రీనివాస్, చక్రధర్, శ్రీనివాస్‌రెడ్డి పోలీసులతో కలిసి ఆయుధ పూజ నిర్వహించారు. కార్యక్రమాల్లో ఆయా గ్రామాల మాజీ సర్పంచ్‌లు, మాజీ ఎంపీటీసీలు, నాయకులు పాల్గొన్నారు.

సిద్ధేశ్వరాలయ ప్రాంగణంలో రావణ ప్రతిమకు నిప్పు పెడుతున్న ఎమ్మెల్యే నాయిని తదితరులు

శాయంపేట : దహనమవుతున్న రావణాసుర ప్రతిమ

భీమదేవరపల్లి: ముల్కనూరులో దహనవుతున్న రావణప్రతిమ

కాజీపేట : బాపూజీనగర్‌లో రావణవధ కార్యక్రమంలో పాల్గొన్న ప్రజలు

దామెర : ఊరుగొండలో పూజల్లో పాల్గొన్న నాయకులు

## బీఆర్ భగవాన్‌దాస్‌కు నివాళి

హనుమకొండ చౌరస్తా, అక్టోబర్ 13 : సీపీఐ నేత, కామ్రేడ్ బీఆర్ భగవాన్‌దాస్ వర్ధంతి సందర్భంగా హనుమకొండ జూనియర్ కాలేజీ జంక్షన్‌లోని ఆయన విగ్రహానికి పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి, వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఆయన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో కార్పొరేటర్ పోతుల శ్రీమన్నారాయణ, స్టేట్ ఫైనాన్స్ కమిషన్ చైర్మన్ సిరిసిల్ల రాజయ్య, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాస్‌రావు, బీఆర్ లెనిన్, సీపీఐ నేతలు పాల్గొన్నారు.

## ప్రొఫెసర్ సాయిబాబాకు..

హనుమకొండ, అక్టోబర్ 13 : ప్రొఫెసర్ జీఎన్ సాయిబాబాకు ప్రజా సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో నివాళులర్పించారు. ఆదివారం హనుమకొండ నక్కలగుట్టలోని కాళోజీ జంక్షన్ వద్ద ఈ కార్యక్రమం నిర్వహించారు. తాడిత, పీడిత ప్రజల కోసం సాయిబాబా అహర్నిశలు కృషి చేశారని పేర్కొన్నారు. రాజ్యహింసకు బలైన హక్కుల యోధుడికి జోహార్లు తెలిపారు.

కుమార్‌ను సన్మానిస్తున్న గ్రామస్తులు

## ఉద్యోగం సాధించిన ఇద్దరికి సన్మానం

శాయంపేట, అక్టోబర్ 13 : మండలంలోని మైలారం గ్రామానికి చెందిన మామిడిపెల్లి మానస, అరికిల్ల కుమార్ ఇటీవల డీఎస్సీలో ప్రతిభ చూపి ఉద్యోగాలు సాధించారు. ఈ క్రమంలో మాజీ సర్పంచ్ అరికిల్ల ప్రసాద్ ఆదివారం ఇద్దరికి శాలువాలు కప్పి సన్మానించారు. కార్యక్రమంలో అరికిల్ల కరుణాసాగర్, మాజీ ఎంపీటీసీ మామిడిపెల్లి సాంబయ్య, అరికిల్ల సంపత్, కిషన్, చేరాలు పాల్గొన్నారు.

## పోగొట్టుకున్న సెల్‌ఫోన్ అప్పగింత

ఫోన్‌ను అప్పగిస్తున్న పోలీసులు

శాయంపేట, అక్టోబర్ 13 : దొరికిన సెల్‌ఫోన్‌ను పోలీసుల ద్వారా ఓ ఆటోడ్రైవర్ బాధితుడికి అప్పగించాడు. మండలంలోని మైలారం గ్రామానికి చెందిన ఆటోడ్రైవర్ అరికిల్ల సురేశ్‌కు మాందారిపేట సమీపంలో రోడ్డుపై స్మార్ట్ ఫోన్ దొరికింది. దీంతో అతడు ఆ ఫోన్‌ను స్థానిక పోలీస్ స్టేషన్‌కు వెళ్లి హెడ్ కానిస్టేబుల్ వెంకట్‌రామ్ నాయక్‌కు అప్పగించాడు. అది పరకాల మండలం పోచారం గ్రామానికి చెందిన దార భిక్షపతిగా గుర్తించి, ఆదివారం పోలీస్ స్టేషన్‌లో ఫోన్‌ను అప్పగించారు. కాగా, ఫోన్‌ను తీసుకొచ్చిన సురేశ్‌ను ఎస్సై ప్రమోద్‌కుమార్ అభినందించారు.

## నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

హనుమకొండ, అక్టోబర్ 13 : హనుమకొండ టౌన్ పరిధిలో పలు ప్రాంతాల్లో సోమవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని హనుమకొండ టౌన్ ఆపరేషన్ డీఈ జీ సాంబారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. అభివృద్ధి పనుల సందర్భంగా కలెక్టరేట్ సబ్ స్టేషన్ పరిధిలో ఉదయం 11.30 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు పోస్టల్ కాలనీ, శాంతినగర్, సుబేదారి ఏరియాలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రజలు సహకరించాలని కోరారు.

## నేడు బల్దియా గ్రీవెన్స్

వరంగల్, అక్టోబర్ 13 : గ్రేటర్ కార్పొరేషన్ ప్రధాన కార్యాలయంలో సోమవారం గ్రీవెన్స్ నిర్వహించనున్నట్లు కమిషనర్ అశ్వినీ తానాజీ వాకేడే ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10.30 గంటల నుంచి గ్రీవెన్స్‌లో ప్రజల నుంచి వినతులు, ఫిర్యాదులు స్వీకరిస్తామని పేర్కొన్నారు. సమస్యల పరిష్కారానికి గ్రీవెన్స్‌ను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అధికారులు సకాలంలో గ్రీవెన్స్‌కు హాజరుకావాలని ఆదేశించారు.

చినిగిన బీఆర్‌ఎస్ ఫ్లెక్సీ

## బీఆర్‌ఎస్ ఫ్లెక్సీలను చింపిన గుర్తుతెలియని వ్యక్తులు

పరకాల, అక్టోబర్ 13 : బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలను గుర్తుతెలియని వ్యక్తులు చింపిన ఘటన మండలంలోని నాగారం గ్రామంలో శనివారం రాత్రి చోటు చేసుకుంది. మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ చింతిరెడ్డి మధుసూదన్‌రెడ్డి ఫొటోలతో స్థానిక బీఆర్‌ఎస్ నాయకులు బతుకమ్మ, దసరా శుభాకాంక్షలు తెలుపుతూ ఫ్లెక్సీని ఏర్పాటు చేశారు. కాగా, కొంతమంది గుర్తుతెలియని వ్యక్తులు శనివారం రాత్రి ఫ్లెక్సీని చింపివేశారు. ఈ ఘటనపై మాజీ వైస్ ఎంపీపీ మాట్లాడుతూ కొందరు బీఆర్‌ఎస్‌కు వస్తున్న ఆదరణను ఓర్వలేక ఫ్లెక్సీని చింపడం సిగ్గుచేటన్నారు. ఈ ఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

హౌసుబుజుర్గులో నివాళులర్పిస్తున్న చల్లా ధర్మారెడ్డి

## కార్యకర్తలను కంటికి రెప్పలా కాపాడుకుంటా

### మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి

ఆత్మకూరు, అక్టోబర్ 13 : కార్యకర్తలను కంటికి రెప్పలా కాపాడుకుంటానని పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి అన్నారు. మండలంలోని పెద్దాపురం గ్రామానికి చెందిన లకిడే రాజమల్లాజీ, జిల్లపెల్లి సాయమ్మ, పెంచికలపేటకు చెందిన మందపల్లి చిరంజీవి, హౌసుబుజుర్గుకు చెందిన నీలం స్రవంతి, తిరుమలగిరికి చెందిన కాట్రేవుల సాంబమూర్తి మృతి చెందగా ఆదివారం బాధిత కుటుంబాలను చల్లా పరామర్శించి, ఆర్థిక సాయం అందజేశారు. ఆయన వెంట బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు సంజీవరెడ్డి, ప్రధాన కార్యదర్శి బొల్లోజు కుమారస్వామి, మాజీ సర్పంచ్‌లు రంపీస మనోహర్, సావురే కమలారాజేశ్వర్‌రావు, ఎస్‌కే రబీయాబీహుస్సేన్, కోరె లలితారమేశ్, బీఆర్‌ఎస్ నాయకులు డీఆర్, పాపని రవీందర్, భగవాన్‌రెడ్డి, గుండెబోయిన బాలకృష్ణ, ఎండీ అంకూస్ ఉన్నారు.

## జీపీ వాటర్‌మన్ ఆత్మహత్య

గువ్వల రాజు(ఫైల్)

ఐనవోలు, అక్టోబర్ 13 : పురుగు మందు తాగి వాటర్‌మన్ ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్సై పస్తం శ్రీనివాస్ కథనం ప్రకారం మండలంలోని ముల్కలగూడేనికి చెందిన గువ్వల రాజు(28) పంచాయతీలో వాటర్‌మెన్‌గా పని చేస్తున్నాడు. శనివారం దసరా సందర్భంగా మద్యం అధికంగా తాగి, ఉత్సవాల్లో హల్‌చల్ చేశాడు. మద్యం మత్తులో తెల్లవారుజామున పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం ఎంజీఎం దవాఖానలో చేర్పించారు. చికిత్స పొందుతూ ఆదివారం ఉదయం మృతి చెందాడు. మృతుడి తండ్రి గువ్వల రమేశ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

## గుండెపోటుతో కాంట్రాక్టు లెక్చరర్ మృతి

సురేశ్(ఫైల్)

హనుమకొండ చౌరస్తా, అక్టోబర్ 13 : ఆర్ట్స్ కాలేజీలోని వాణిజ్యశాస్త్ర ఒప్పంద అధ్యాపకుడు, న్యాయశాస్త్ర హాస్టల్ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ సావుల సురేశ్ ఆదివారం ఉదయం గుండెపోటుతో హనుమకొండలోని తన ఇంట్లో మృతి చెందారు. ఆయన మృతిపై కాలేజీ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ సుంకరి జ్యోతి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. సురేశ్ మృతి కాలేజీకి తీరని అభిప్రాయపడ్డారు. కాగా, సురేశ్‌కు భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. పెద్దకుమార్తె ఐఐటీలో బీటెక్ చదువుతుండగా, రెండో కూతురికి ఇటీవల ఎంబీబీఎస్‌లో సీటు కూడా వచ్చింది.

## రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి..

ఐలయ్య(ఫైల్)

ఐనవోలు, అక్టోబర్ 13 : రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఎస్సై శ్రీనివాస్ కథనం ప్రకారం.. మండలంలోని పంథినికి చెందిన మేకల ఐలయ్య(57) వ్యవసాయ కూలీగా పనిచేస్తున్నాడు. ఈ క్రమంలో గురువారం ఉదయం పనుల నిమిత్తం జాతీయ రహదారిపై సైకిల్‌ను నడిపించుకుంటూ వెళ్తుండగా వెనుక నుంచి వచ్చిన లారీ ఐలయ్యను ఢీకొట్టింది. తీవ్ర గాయాలైన ఆయనను చికిత్స నిమిత్తం ఎంజీఎం దవాఖానలో చేర్పించారు. అక్కడ చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. డ్రైవర్ మద్యం మత్తులో లారీని నడుపడమే ప్రమాదానికి కారణమని గ్రామస్తులు తెలిపారు. మృతుడికి భార్య స్వరూప, ఇద్దరు కుమారులు చంద్రమౌళి, శ్రీకాంత్ ఉన్నారు. కుమారుడు శ్రీకాంత్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

# శరన్నవరాత్రోత్సవాలు పరిసమాప్తం

హనుమకొండ చౌరస్తా : వేయిస్తంభాలగుడిలో శ్రీచక్రస్నానార్చన నిర్వహిస్తున్న పూజారులు

ఐనవోలు: నిజరూపంలో భ్రమరాంబికాదేవి

హనుమకొండ చౌరస్తా/ఐనవోలు/ శాయంపేట/ ఆత్మకూరు/ హసన్‌పర్తి, అక్టోబర్ 13: దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు వైభవంగా ముగిశాయి. విజయదశమి సందర్భంగా పదో రోజు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. చారిత్రక వేయిస్తంభాల రుద్రేశ్వరాలయంలో ఆయుధ పూజలు నిర్వహించి, రుద్రేశ్వరీదేవిని రాజరాజేశ్వరీదేవిగా అలంకరించారు. నందివాహనంపై అమ్మవారిని వాహనసేవ చేశారు. ఊరేగింపుగా తీసుకెళ్లి ఆలయంలోని ప్రాచీన కోనేరులో శ్రీచక్రస్నానార్చన చేపట్టారు. ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి–నీలిమ దంపతులు, విష్ణువర్ధన్‌రెడ్డి–గోదాదేవి, కిషన్‌లాల్ దంపతులు, పల్లం రమేశ్ దంపతులు పాల్గొని అమ్మవారికి అభిషేకాలు చేసినట్లు ప్రధానార్చకుడు గంగు ఉపేంద్రశర్మ తెలిపారు. ప్రదోశకాలంలో హైకోర్టు జడ్జి సూరపెల్లి నందా, ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, సిరిసిల్ల రాజయ్య, పోతుల శ్రీమాన్, బోడ డిన్నా, పుప్పాల ప్రభాకర్, చీకటి ఆనంద్, ఆర్యవైశ్య సంఘం నాయకులు గట్టు మహేశ్‌బాబు పాల్గొని పూజలు చేశారు. ఉత్సవమూర్తిని పద్మాక్షి ఆలయ గుండంలో నిమజ్జనం చేశారు. కార్యక్రమంలో గంగు మణికంఠశర్మ, సందీప్‌శర్మ, ప్రణవ్ పాల్గొన్నారు. అలాగే, ఐనవోలు మల్లికార్జునస్వామి దేవాలయంలోని భ్రమరాంబికాదేవి అమ్మవారు భక్తులకు నిజరూపంలో దర్శనమిచ్చారు. శరన్నవరాత్రి ఉత్సవాల ముగింపు సందర్భంగా ఉపప్రధాన అర్చకుడు పాతర్లపాటి రవీందర్, ఐనవోలు మధుకర్‌శర్మ, విక్రాంత్ వినాయక్‌జోషి ప్రత్యేక పూజలు చేశారు. ఈవో అద్దంకి నాగేశ్వర్‌రావు వసంత దంపతులు, ముఖ్య అర్చకులు పాతర్లపాటి శ్రీనివాసశర్మ, అర్చకులు నరేశ్‌శర్మ, భాను ప్రసాద్ శర్మ, మధుశర్మ, శ్రీనివాస్ పాల్గొన్నారు. శాయంపేటలోని శివ మార్కండేయ, వేంకటేశ్వర స్వామి ఆలయ సముదాయాల్లో ఎస్సై ప్రమోద్ కుమార్ పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ప్రత్యేకంగా అలంకరించిన వాహనంపై విగ్రహాన్ని ప్రతిష్ఠించి, శోభాయాత్ర నిర్వహించారు. అనంతరం స్థానిక దేవుని చెరువులో నిమజ్జనం చేశారు. ఈ కార్యక్రమంలోఅర్చకుడు మార్త రాజకుమార్, ఆలయ కమిటీ చైర్మన్ భాసాని సూర్య ప్రకాశ్, భక్తులు పాల్గొన్నారు. ఎస్‌పీటీ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన దుర్గాదేవి విగ్రహాన్ని స్థానిక తాళ్లకుంట చెరువులో నిమజ్జనం చేశారు. ఆత్మకూరులోని పోచమ్మ సెంటర్‌లో శ్రీ వేణుగోపాల స్వామి భజన మండలి ఆధ్వర్యంలో దుర్గామాత శోభాయాత్రను ఘనంగా నిర్వహించారు. అలాగే, హసన్‌పర్తిలోని కూడా దుర్గామాత శోభాయాత్రను మహిళలు కోలాటాలతో ఘనంగా నిర్వహించారు.

ఆత్మకూరు : దుర్గామాత శోభాయాత్రలో కోలాటం వేస్తున్న మహిళలు

హసన్‌పర్తి : శోభాయాత్రలో నృత్యం వేస్తున్న మహిళలు

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

సెప్టిక్ ట్యాంక్ క్లీనర్
★ సెప్టిక్ ట్యాంక్ క్లీనర్ నూతన సాంకేతిక పరిజ్ఞానంతో గల్ఫర్ మిషన్ ద్వారా సెప్టిక్ ట్యాంక్ క్లీన్ చేయబడును. డి.ఎస్. రావు. Cont: 9849145043, 9866584455. NTW-000

WANTED HOSPITAL STAFF
★PHARMACY BOYS (మందుల షాపు), OT BOYS (ఆపరేషన్ థియేటర్), SUPERVISIORS (Administrators) & LAB TECHNICIANS కావలెను. సంప్ర : గార్డియన్ హాస్పిటల్, వరంగల్. 2 to 4 PM. NTW-0436

CHANGE OF NAME
★ I, Mohammad husamoddin (Old Names) S/o. Mohammad Ekramoddin, R/o.H.No.6-4-101, Street : Arfathpura, Mandal: KORATLA-505326, District Jagtial, Telangana, Have Changed My Name as MOHAMMAD HUSSAM UDDIN NTK-325721

SHUTTERS FOR SALE
★ హనుమకొండ చౌరస్తా మహేంద్ర క్లాత్ షోరూం ప్రక్కన గల్లీలో SSN Reddy కాంప్లెక్స్ నందు 1st ఫ్లోర్‌లో 3 కమర్షియల్ షట్టర్స్ అమ్మకానికి కలవు. సంప్ర|| సెల్: 8686778662. NTW-326423

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

అతి తక్కువ ఖర్చు అత్యధిక ప్రచారం

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
4 లైన్ల బ్లాక్ అండ్ వైట్ ప్రకటన కేవలం 200/- మాత్రమే
4 లైన్ల బ్లాక్ అండ్ వైట్ 4 ప్రకటనలకు కేవలం 600/- మాత్రమే
ప్రతి అదనపు లైన్‌కు 50/- మాత్రమే
ప్రకటనల విభాగం : 9182777552
HANAMKONDA 9182777563 9182777961
WARANGAL 9182777556
JAYASHANKAR BHUPALPALLY - 9182777559
MULUGU - 9182777135
MAHABUBABAD - 9182777557
JANGAON - 9182777565